Namasthe Telangana DT 28/04/14.

# మెట్రో మాదే..కాదు మాది..

- ప్రచారాస్త్రంగా మెట్రోరైలు ప్రాజెక్ట్
- అందరి నోటా మెట్రో మాట
- తమదంటే తమదని గొప్పలు
- ఎవరికి ఓట్లురాల్చునో మరి..!





సిటీబ్యూరో, టీమీడియా : మెట్రో రైల్ ప్రాజెక్ట్ సార్వత్రిక ఎన్నికల్లో నాయకులకు ప్రచారాస్త్రంగా మారింది. ఓట్లు రాల్చేమంత్రంగా మారి మెట్రో ప్రాజెక్ట్ రాజకీయాలను వేడెక్కిస్తోంది. ప్రతీ నాయకుడు మెట్రో జపం చేస్తున్నాడు. ఎక్కడ ఎవరి ప్రచారంలో విన్నా.. చూసినా మెట్రో మాదంటే మాదంటూ చెప్పుకొస్తున్నారు. ప్రాజెక్ట్ తమ పుణ్యమేనంటే..తమ పుణ్యమేనని నొక్కి చెప్పుతున్నారు. టీడీపీ, ఎంఐఎం, లోక్‌సత్తా, బీజేపీ, టీడీపీ, కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ... ఇలా అన్నీ పార్టీలు బీరాలుపోతున్నాయి. ప్రాజెక్ట్ సాధించిన ఘనత విషయంలో కాంగ్రెస్, టీడీపీల మధ్యనైతే చిన్నస్థాయి యుద్ధమే కొనసాగుతోంది. ఏ పార్టీ ప్రచారం పత్రాల్లో మెట్రో రైలు బొమ్మలేసుకుని ఓట్లు దండుకోవడానికి తీవ్రంగా యత్నిస్తున్నారు. మెట్రో పనులు వేగంగా సాగుతుండటం, నగరవాసులు ప్రాజెక్ట్ ఎప్పుడవుతుందా ఆసక్తిగా గమనిస్తుండటంతో నాయకులు దీన్ని ఓట్లురాల్చే మంత్రదండంలా చూస్తున్నారు. మెట్రో నిర్మాణంతో హైదరాబాద్ ప్రపంచ నగరాలతో పోటీపడే స్థాయికి చేరుకోనుండటంతో తమకు కలిసి వస్తుందని నాయకులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

**అందరిది ఒకే నినాదం ...**

మెట్రో తమ గొప్పేనని చెప్పుకోవడంలో తెలుగుదేశం ముందుంది. ఆ పార్టీ అధినేత చంద్రబాబు తానే మెట్రోరైలు ప్రాజెక్ట్‌ను తీసుకొచ్చానని ఏనాడో డాబుకు పోయాడు. నిన్నటికి నిన్న రాహుల్‌గాంధీ ఎల్బీస్టేడియంలో నిర్వహించిన సభలో మెట్రో రైలు ప్రాజెక్ట్ తమ ఘనతేనని నొక్కి చెప్పారు. మరిన్ని ప్రాంతాలకు మెట్రో రైలు విస్తరిస్తామని హామీ ఇచ్చారు. ఎంఐఎం సైతం మెట్రో బోగీల ఫొటోలతో 'అవర్ వర్క్ ఈజ్ అవర్ ఐడెంటిటీ' అంటూ హోర్డింగ్‌లు ఏర్పాటు చేసింది. పాతబస్తీలో మెట్రోరైలుకు అడ్డంకులు ఎదురవుతాయన్న ఆందోళనలో ఉన్న హెచ్‌ఎంఆర్ వర్గాలకు ఇది తీపికబురుగా మారింది. లోక్‌సత్తా అధినేత జయప్రకాష్‌నారాయణ ఆ పార్టీ అభ్యర్థులు ప్రజా రవాణా, అర్బన్ డెవలప్‌మెంట్ అంశాల్లో తమ సూచనల ప్రకారమే మెట్రోరైలును నిర్మిస్తున్నారని ప్రచారం చేసుకుంటోంది. ఇలాంటి ప్రాజెక్ట్‌లు మరిన్ని చేపట్టాలన్న కూడా డిమాండ్ చేస్తోంది. బీజేపీ పార్టీ సైతం మెట్రోను నిర్ణీతకాలంలో పూర్తి చేయడంతో పాటు, ఏకంగా మెట్రోరైలును కరీంనగర్ వరకు విస్తరిస్తామని హామీలు గుప్పిస్తున్నారు.

**ఆప్‌ది విరుద్ధమైన డిమాండ్....**

వీటన్నింటికి విరుద్ధంగా ఆమ్ ఆద్మీ పార్టీ కొత్త పల్లవినందుకుంది. ప్రాజెక్ట్‌ను స్వాగతిస్తూనే రెండు కారిడార్లు ఒకే. కానీ ప్రాజెక్ట్‌లో చేపడుతున్న మూడు కారిడార్లలో కారిడార్ -2ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తోంది. నిర్వాసితులు అధికంగా ఉండడంతో పాటు ప్రయోజనం అంతగా లేకదని, వెంటనే దాన్ని రద్దు చేయాలని ఆ పార్టీ ఆయా ప్రాంతాల్లో ప్రచారం చేసుకుంటోంది. ఇంత మంది నాయకులు తామంటే తామంటున్నారా.. కానీ ఎన్నికల్లో మెట్రో రైలు ఎవరికి ఓట్లురాల్చుతుందో వేచి చూడాలి మరి.